క్లుప్తంగా

ఉచిత విద్యకు నమోదు చేసుకోవాలి

కరప: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. కరపలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులు నేరుగా గాని, గ్రామ సచివాలయాలకు వెళితే ఉచితంగా నమోదు చేస్తారన్నారు. అర్హులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని, వారి పేర్లను వెబ్‌సైట్‌లో ఉంచుతామని, ఎమ్మార్సీ నుంచి కాల్‌చేసి తల్లిదండ్రులకు తెలియజేస్తారన్నారు. వికలాంగులు, షెడ్యూల్ కులాలు, బలహీన వర్గాలు, ఈబీసీ, అనాథలు, హెచ్‌ఐవీ ప్రభావిత పిల్లలు అర్హులన్నారు. వీరికి ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తారని వివరించారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం



సిరిపురంలో షిరిడీ సాయిబాబాకు హారతి ఇస్తున్న అర్చకులు

కరప: సిరిపురంలోని షిరిడీ సాయిబాబా మందిరం 23వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. మందిర వ్యవస్థాపక ధర్మకర్త చిక్కాల వీరవెంకట సత్యనారాయణ (దొరబాబు), సుబ్బారావు సోదరుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు సిరిపురం, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారికి కాకడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాల అనంతరం సాయినాథునికి గ్రామోత్సవం జరిపారు. సుమారు 10 వేల మందికి ప్రసాద వితరణ చేశారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్తు సిబ్బంది సేవలు ఎనలేనివి



లైన్‌మెన్‌ను సత్కరిస్తున్న డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం సోమవారం లైన్‌మెన్ దివస్‌ను స్థానికంగా కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది సేవలు, నిబద్ధతను అధికారులు కొనియాడారు. సిబ్బంది పాటించాల్సిన భద్రతా చర్యలను వివరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఆరుగురు సిబ్బందిని సత్కరించారు. సమావేశంలో కాకినాడ సిటీ 1, 2, రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, కాకినాడ డివిజన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల వాక్‌థాన్

బాలాజీచెరువు: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారిత అనే అంశంపై వివరిస్తూ యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు వాక్‌థాన్ నిర్వహించారు. కాకినాడ మెయిన్‌రోడ్ యూనియన్ బ్యాంక్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీని యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ కాకి సాయిమనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు అంశాలు వివరించారు. ఉప ప్రాంతీయ అధికారి రంగారావు, జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

కరప: పాన్ షాపు పైకప్పుపై పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొంగోడులో జరిగింది. కరప పోలీసుల కథనం ప్రకారం.. కొంగోడు గ్రామానికి చెందిన మేడిశెట్టి రమణయ్య (42) కూలి పనిచేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రమణయ్య సోమవారం ఉదయం అదే గ్రామంలోని చింతా బూరయ్య పాన్ షాపు పునర్నిర్మాణ పనికి వెళ్లాడు. ఐరన్ రాడ్లతో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగకు తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రమణయ్యను చికిత్స నిమిత్తం గొల్లపాలెం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించాడు. మృతుడి భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

పరీక్షలకు 15 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 260 మందికి 245 మంది హాజరైనట్టు ఆయన వివరించారు.

విద్యయాభవ..

- జగనన్న విద్యా, వసతి దీవెనలతో మేలు
- పేదల ఉన్నత చదువుకు ఊతం
- సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో వేల మందికి లబ్ధి

కాకినాడ సిటీ: విద్యతోనే ప్రతి ఇంటికి వెలుగు వస్తుందని.. ఏ ఒక్కరూ చదువుకు ఇబ్బంది పడకూడదని.. పేదల ఇంట విద్యా కుసుమాలు వెల్లివిరియాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమతం. అదే విషయాన్ని ఆచరణలోకి తీసుకొచ్చి ప్రతి ఇంటికీ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కాంతులు తీసుకొచ్చారు. విద్యార్థుల ఉన్నత చదువుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, డిప్లొమా వంటి కోర్సులు చదివే పేద విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను 'జగనన్న విద్యాదీవెన' పథకం కింద అందిస్తోంది. దీంతో పాటు జగనన్న వసతి దీవెన పేరుతో రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ ఆర్థిక సాయం ఇస్తోంది. ఇలా పేద విద్యార్థుల ఉన్నత చదువుల కలను సాకారం చేస్తోంది. దీనిపై అంతటా ఆనందం వ్యక్తమవుతోంది. కాకినాడ నగరంలో జగనన్న విద్యాదీవెన పథకం కింద 6,200 మంది, రూరల్ నియోజకవర్గంలో 5,316 మందికి సుమారు 24.35 కోట్లు అందించింది. వసతి దీవెన పథకం ద్వారా రూ. 6 కోట్లను ప్రభుత్వం అందించి 11,516 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చింది. ఇది విద్యార్థుల చదువుకు భరోసాగా మారింది. తద్వారా ఎటువంటి ఆటంకాలు లేకుండా విద్య సాగుతోంది.



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి విద్యా దీవెన నమూనా చెక్కు అందుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నా కల నెరవేరింది



నేను డిగ్రీ చదువుతున్నా. ఉన్నత విద్య అభ్యసించేందుకు జగనన్న విద్యాదీవెన ఎంతో ఉపయోగపడుతుంది. డిగ్రీ చదువుకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం అందిస్తుండటంతో చదువు సాఫీగా సాగుతోంది. ఇదంతా జగనన్న విద్యాదీవెన పథకం వల్లే సాకారమైంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

–ఎస్.మోహన్‌బాబు, డిగ్రీ, పీఆర్ కళాశాల

జగనన్న మేలు మరువలేం



జగనన్న విద్యా రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా డిగ్రీ చదువగలుగుతున్నా. పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తూ మా చదువుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. ముఖ్యమంత్రి జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.

–పి.నోహిత్, పీఆర్ డిగ్రీ కళాశాల

ప్రభుత్వ ప్రోత్సాహంతో..



ప్రభుత్వ ప్రోత్సాహంతోనే నేను ఉన్నత విద్య అభ్యసిస్తున్నా. సాధారణంగా డిగ్రీ కూడా చదవలేని ఆర్థిక పరిస్థితి మాది. జగనన్న పుణ్యమా అని నేను డిగ్రీ చదువుతున్నాను. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు. మంచిగా చదువుకుని మా కుటుంబానికి అండగా ఉంటా.

–పి.సూర్యలక్ష్మణ, పీఆర్ డిగ్రీ కళాశాల

చదువు సాఫీగా..



జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకాలతో మా చదువులు సాఫీగా సాగుతున్నాయి. కాలేజీ ఫీజులు చెల్లించడానికి ఎటువంటి ఇబ్బందులు లేవు. మాలాంటి మధ్యతరగతి విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకుండా జగనన్న అండగా ఉన్నారు. ఆయనకు ధన్యవాదాలు.

–పి.శరణ్య, డిగ్రీ, కాకినాడ

పేదలకు వరం



విద్యా, వసతి దీవెన పథకాలు పేదలకు వరాలు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువు సాఫీగా సాగుతోంది. ప్రభుత్వ తోడ్పాటుతోనే ఇందతా సాధ్యమవుతుంది. నాలాంటి పేద విద్యార్థుల చదువుకు మార్గం ఏర్పడింది.

–పి.రాజీ, పీఆర్ డిగ్రీ కళాశాల

ఆసుపత్రికెళ్లి.. పింఛన్ ఇచ్చి



బాబూరావుకు పింఛన్ ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సత్య

కరప: వేములవాడకు చెందిన పుణ్యమంతుల బాబూరావు అనారోగ్యంతో కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని వేములవాడ గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావుకు సర్పంచ్ కమిడి మంగాదేవి తెలిపారు. కార్యదర్శి సూచనల మేరకు సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్ సత్య కాకినాడ వెళ్లి పింఛన్ అందజేశారు.

హ్యాపీ బర్త్ డే



వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

నేను సైతం 'సిద్ధం'



వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు గుర్రయ్య యాదవ్‌ను అభినందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ప్రచార పర్వంలో దూసుకుపోతుండగా.. ఆ పార్టీ జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షుడు ఒమ్మి గుర్రయ్య యాదవ్ నేను సైతం సిద్ధమంటూ ప్రచారం ప్రారంభించారు. సిద్ధం పేరిట తయారు చేసిన మూడు చక్రాల స్కూటీపై ప్రచారం చేస్తున్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బర్త్ డే వేడుకల్లో ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రి దాడిశెట్టి రాజా తదితరులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఒమ్మి గుర్రయ్య యాదవ్ 'సాక్షి'తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే తనకు అభిమానమని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. జిల్లాలోని దివ్యాంగులను జాగృతం చేసేలా తన మూడు చక్రాల వాహనానికి సిద్ధం పేరిట స్టిక్కరింగ్ చేసి ప్రచారం సాగిస్తున్నట్టు తెలిపారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లతో శాశ్వత హక్కు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- లబ్ధిదారులకు ఇళ్ల పత్రాల పంపిణీ



ఇంద్రపాలెంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వం అందజేసిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు కూడా చేయించి, శాశ్వతంగా హక్కు కల్పిస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని ఇంద్రపాలెం, చీడిగ గ్రామాల లబ్ధిదారులకు సోమవారం సాయంత్రం ఇంద్రపాలెం శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో ఏర్పాటైన కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా 32 వేల మంది అర్హులకు ఇళ్ల పట్టాలను అందించామన్నారు. పేదల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. అలాగే రూ.లక్షల విలువ చేసే ఇళ్ల స్థలాలను అందించడంతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వడంతో పేదలకు సొంత ఆస్తి ఇచ్చినట్లు అవుతుందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నియోజకవర్గంలో వేగవంతంగా జరుగుతుందన్నారు. ఇంద్రపాలెం, చీడిగలలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పట్టాలను అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జి, అనుసూరి ప్రభాకర్, కొప్పిశెట్టి గణేష్, తోటకూర శ్రీనివాస్, గీసాల వీరబాబు, రాధామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులను కమిషనర్ స్వీకరించారు. సుమారు 12 మంది వివిధ సమస్యలను తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కమిషనర్ వెంకటరావు, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఫిర్యాదులు తీసుకున్నారు. నగరంలో వివిధ సమస్యలపై 16 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించడంతో పాటు అందుకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారులకు కూడా తెలియజేస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా తమ సమస్యలను తెలియజేయవచ్చని వివరించారు. ఆర్థికపరమైన, న్యాయ సంబంధమైన అంశాలు మినహా మిగిలిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతికే 'జగనన్న పాల వెల్లువ'



అరట్లకట్టలో మహిళా పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ సూర్యప్రకాష్

కరప: పాడి రైతుల అభ్యున్నతికే జగనన్న పాల వెల్లువ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్ అన్నారు. అరట్లకట్టలో సోమవారం మహిళా పాడి రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీలు అన్నింటి కంటే అమూల్ కంపెనీ శాస్త్రీయ పద్ధతిలో పాలను సేకరించి, అందరి కంటే అధిక ధర చెల్లిస్తుందన్నారు. అమూల్ పాల సేకరణ కేంద్రానికి పాడి రైతులు వరసగా 10 రోజులు పాలు పోస్తే 13వ రోజునే సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమవుతాయన్నారు. రైతులకు ఇస్తున్నట్టుగానే పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డు ఇస్తారన్నారు. 7 శాతం వడ్డీతో రూ.35 వేల వరకూ వాడుకోచ్చని, సకాలంలో తిరిగి చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రిబేట్ వస్తుందన్నారు. అంటే పావలా వడ్డీ పడుతుందన్నారు. స్త్రీనిధి నుంచి రూ.75 వేల వరకూ రుణం తీసుకోవచ్చని, దానితో పాడి గేదెలను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో మొదటి విడతలో 8 మండలాల్లో 96 గ్రామాల్లో పాల సేకరణ జరుగుతోందన్నారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో 19 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. రెండో విడతలో మరో 8 మండలాల్లో అమూల్ పాల సేకరణ కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 26 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల్లో మిషనరీ ఏర్పాటు చేసి, ప్రమోటర్స్ మహిళా రైతులతో సంఘాలు ఏర్పాటు చేసి, వారితోనే కేంద్రాలను నిర్వహిస్తారన్నారు. వచ్చిన లాభాలను సదరు సంఘ సభ్యులైన మహిళలకే పంచుతామని జేడీ తెలిపారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ రెండో విడతలో కరప మండలంలో 14 గ్రామాల్లో అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం అరట్లకట్ట, కొరుపల్లి గ్రామాల్లో అధికారులు పర్యటించి కేంద్రాల్లో మిషనరీ ఏర్పాటును పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎన్‌జే సురేష్ బాబు, డాక్టర్ తిరుమలరావు, ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ, కార్యదర్శి వి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మాట ఇస్తే చేస్తారంతే..

పెద్దాపురం: మాట ఇస్తే తప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారని, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో సోమవారం నవరత్నాలు అందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌లతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గోపు మురళీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుడికి సొంత ఆస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అందజేస్తున్నామన్నారు. ఏటిపట్టు గ్రామాల్లో పది గ్రామాలకు పట్టణ శివారులో రామేశంమెట్ట వద్ద స్థలాలు ఇవ్వడం పట్ల కొంతమంది అనవసర రాద్ధాంతం చేశారన్నారు. అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, ఛదలాడ గ్రామ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, నాగబోయిన రాజబాబు పాల్గొన్నారు.

మన గ్యాస్ మనకే దక్కాలి

కాకినాడ సిటీ: కాకినాడ సముద్రతీర ప్రాంతంలో పడిన చమురు గ్యాస్ మన ఆంధ్రప్రదేశ్‌కే దక్కాలని, గ్యాస్ వెలికితీతతో నష్టపోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ కాకినాడ జిల్లా అఖిలపక్ష నాయకులు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతి పత్రం అందజేశారు. కాకినాడ సముద్రతీర ప్రాంతంలో ఓఎన్జీసీ చమురు గ్యాస్ నిక్షేపాల కోసం సముద్ర గర్భంలో ప్రతిపాదించిన సిసిమిక్ సర్వేతో తీర ప్రాంత మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని నాయకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సర్వే సమయంలో కాకినాడకు మూడు దిక్కులా 500 చదరపు కిలో మీటర్ల పరిధిలో మత్స్యకారులు వేటకు వెళ్లనివ్వకుండా నియంత్రించాలని ఓఎన్జీసీ సంస్థ మత్స్య శాఖకు లేఖ ఇచ్చిందన్నారు. దీనివల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, నష్టపరిహారం అందజేయాలని కోరారు. అఖిలపక్ష నాయకులు తాటిపాక మధు, వీరేంద్ర, తుమ్మలపల్లి బాబు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, సుంకర సురేష్, కృష్ణమోహన్, పిట్టా వరప్రసాద్, కామిరెడ్డి బోడకొండ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కాకినాడ సిటీ: యానిమేటర్ల దీక్షల సమయంలో సెర్ప్ సీఈఓ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద వెలుగు యానిమేటర్ల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల కాల పరిమితి జీఓ తక్షణం రద్దు చేయాలని, అక్రమంగా తొలగించిన యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకురాలు జి.బేబీరాణి, చెక్కల రాజ్‌కుమార్, వీఓఏల సంఘం నాయకురాలు పోలిశెట్టి మేరీ, ఈశ్వరిబాయి, సత్యవతి, పద్మ, మేరీ, రామలక్ష్మి పాల్గొన్నారు.

భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సామర్లకోట: భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాక్ సిరామిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘెష్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను సోమవారం స్థానిక రాక్ సిరామిక్స్‌లో ప్రారంభించారు. తొలుత భద్రత పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాల్లో పనిచేసే సమయంలో ఎల్లప్పుడూ భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



మహిళా సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డాక్టర్ ప్రదీప్

కాకినాడ క్రైం: మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మహిళా సిబ్బంది వినియోగించుకుంటున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో గైనకాలజీ ఓపీ విభాగంలో సోమవారం ఈ పరీక్షలు జరిగాయి. జీజీహెచ్, ఆర్ఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. తొలి రోజు 19 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ తెలిపారు. వివిధ పరీక్షల తర్వాత ఏడుగురిని అల్ట్రా సౌండ్ అబ్డామిన్ కోసం సిఫార్సు చేశారు. మరో 8 మందికి మామోగ్రామో పరీక్షలు నిర్వహించారు. అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసన్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ప్రదీప్ ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఈ పరీక్షలు నిర్వహించాయి. మంగళవారం లెక్చర్ గ్యాలరీలో తన ఆధ్వర్యంలో రేడియేషన్ అంకాలజీ నిపుణుల ద్వారా క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భూమి కాజేశారని వృద్ధురాలి ఫిర్యాదు



కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న కుదుపూడి వెంకయమ్మ

కాకినాడ సిటీ: తన 39 సెంట్ల భూమిని, ముగ్గురు కొడుకులూ కాజేసి బయటకు గెంటేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాజులూరు మండలం అండ్రంగికి చెందిన కుదుపూడి వెంకయమ్మ (84) కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం ఫిర్యాదు చేశారు. తనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. తన 39 సెంట్ల భూమిలో రెండో కుమార్తె కాకి శాంతికి 15 సెంట్ల భూమిని అన్ రిజిస్టర్ దస్తావేజు రాయించి పెళ్లి చేశామని వెంకయమ్మ వివరించారు. తనకు కళ్లు కనిపించకపోవడంతో తెలియకుండా వేలి ముద్రలు వేయించుకుని ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న తన కుమారులపై చర్యలు తీసుకుని, భూమి ఇప్పించాలని ఆమె కలెక్టర్‌ను కోరింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కృతికా శుక్లా తక్షణ చర్యలు తీసుకోవాలని గొల్లపాలెం పోలీసులను, కాజులూరు తహసీల్దార్‌ను ఆదేశించారు.

వృద్ధుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్: ఎస్.అచ్యుతాపురానికి చెందిన పైడా సుబ్బారావు (64) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. ఐదేళ్ల క్రితం ఆపరేషన్ చేయించుకున్న సుబ్బారావు మద్యం తాగుతుండడంతో ఆదివారం రాత్రి భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురై అర్ధరాత్రి సమయంలో టర్పంటాయిల్‌ను ఒంటిపై వేసుకుని నిప్పు పెట్టుకున్నాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను నాగమల్లితోట జంక్షన్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యార్థులకు 8 బడి బస్సులు

బాలాజీచెరువు: బస్ పాస్‌లు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 8 బడి బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో గత వారం ఎప్పాస్ బేరం అనుకున్నారా అని బస్సు పాస్ విద్యార్థుల కోసం ప్రచురితమైన కథనంపై వివరణ ఇచ్చారు. సాధారణ చార్జీలు చెల్లించే ప్రయాణికుల మాదిరిగానే బస్‌పాస్ హోల్డర్లను ఎక్కించుకోవాలని సిబ్బందికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ఫుట్‌పాత్‌పై నిలబడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.